www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 2 ఆగస్టు 2025

శ్రీరాంనగర్‌లో పారిశుధ్య పనులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

శుభ్రంగా మారిన డ్రెయినేజీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీరాంనగర్‌లో ఉన్న డ్రెయినేజీ కాలువలను పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. ప్రజాశక్తి దిన పత్రికలో శుక్రవారం 'కంపు భరించలేకున్నాం.. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయండి మహాప్రభో' అంటూ కథనం వెలువడింది. ఈ నేపథ్యంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు గండిరోడ్డులోని శ్రీరామ్ నగర్ ప్రాంతంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు తొలగించడంతో పాటు కాలువను శుభ్రం చేశారు. రోడ్డుపై ఎలాంటి మురుగు నీరు ప్రవహించకుండా మట్టిని తొలగించారు. డ్రెయినేజీలోని చెత్తను తొలగించి రోడ్డుపై మురుగునీరు రాకుండా ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లలో 'ఉక్కు' కల సాకారం

- కడపకు రూ.44 వేల కోట్ల పెట్టుబడులు
- వచ్చే ఏడాది నాటికి జిఎన్ఎస్ఎస్ పరుగులు
- రూ.30 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- డిసెంబర్ 26, 27వ తేదీల్లో గండికోట ఉత్సవాలు
- జమ్మలమడుగు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సిఎం చంద్రబాబు

చేనేత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కు పరిశ్రమ మూడేళ్లలో సాకారం కానుందని, 2008 డిసెంబర్ నాటికి రూ.4,500 కోట్లతో ఫేజ్-1 పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామని, జిందాల్ కంపెనీ పనులు ప్రారంభించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో నిర్వహించిన పేదలసేవలో ప్రజావేదిక, పింఛన్ల పంపిణీ, గండికోటలో ఇన్వెస్టర్ల మీట్, టిడిపి కార్యకర్తల వరుస కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో నిర్వహించిన టిడిపి రాష్ట్ర మహానాడులో ఇచ్చిన హామీ మేరకు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీని నిలబెట్టుకున్నామన్నారు. వచ్చే ఏడాది నాటికి జిఎన్ఎస్ఎస్ కాల్వ పనులను కడప ముగింటకు చేరువ చేస్తామన్నారు. గండికోట పర్యాటక ప్రాంతాన్ని అమెరికాలోని గ్రాండ్ కెనాన్ తరహాలో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. రూ.80 కోట్లతో శంకుస్థాపన చేశామని, శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గండికోట అభివృద్ధిని కొనసాగించడంలో భాగంగానే రూ.500 కోట్లతో పలు సంస్థలతో ఒప్పందాలు కుర్చుకున్నామని తెలిపారు. గండికోట, ఒంటిమిట్ట, పెద్దదర్గాలను అనుసందానిస్తూ స్పిర్చ్యువల్ హబ్‌గా మారుస్తామని చెప్పారు. రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని, కొప్పర్తి, ఓర్వకల్లు ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలు వచ్చాయని, భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలు సైతం సీమ వైపు చూసే రోజులొస్తాయని తెలిపారు. కడపలో స్టీల్‌ప్లాంట్, సోలార్, పంప్డ్ స్టోరేజీ, విండ్ సంస్థల ద్వారా 7,109 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేస్తామని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన నిమిత్తం రూ.44 వేల కోట్లతో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. జెఎస్‌డబ్ల్యూ రూ.ఐదువేల కోట్లు పెట్టు బడులు పెట్టనుందని తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని 12 చెరువులకు లిఫ్టు ఇరిగేషన్ సదుపాయం ద్వారా నీటి సదుపాయం కల్పిస్తామన్నారు. రూ.30 కోట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మరో రూ.30 కోట్లను యర్రగుంట్ల, జమ్మలమడుగు మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయిస్తు న్నామన్నారు. గండికోట పెండింగ్ పరిహారాన్ని త్వరలో మంజూరు చేస్తానని హామీనిచ్చారు. అనంతరం దీవెన అనే విద్యార్థిని, నాగమ్మ కుటుంబాలను పరిస్థితిని తెలుసుకుని ముగ్గురు ఔత్సాహికులకు వారి బాగోగులను చూడాలని ఆదేశించారు. గండికోటను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎకోఫ్రెండ్లీ, టెంట్‌సిటీ, బోటింగ్‌తోపాటు లైటింగ్, రోప్‌వే, గ్లాస్ బాటమ్ వాక్‌వే, లైట్ అండ్ సౌండ్ సోలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రాండ్‌కెనాన్‌ను చూడటానికి సెప్టెంబర్ నాటికి హెలీరైడ్స్ మొదలు పెడతామన్నారు. కారవాన్ టూరిజం సర్వీసులు కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు సి.ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోలో ప్రజావేదికకు చంద్రబాబు : గూడెంచెరువులో చేనేత లబ్ధిదారుడు వేణుగోపాల్‌కు పింఛను పంపిణీ చేశారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. మరో ఇంటివద్ద వెలిగండ్ల మునీంద్ర తాను పక్షవాతంలో బాధపడు తున్నానని తనకు పింఛను మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ శ్రీధర్‌ను ఆదేశించారు. గ్రామంలో ఉల్సాల అలివేలమ్మ అనే లబ్ధిదారు ఇంటికెళ్లి వితంతు పింఛను అందించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. పింఛను పంపిణీ అనంతరం ఆటోలో ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు.

వెల్లువెత్తిన వినతులు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెం చెరువు చేరుకున్న సమయంలో సభ అనంతరం అధిక సంఖ్యలో ఫిర్యాదులను వినతిపత్రాలు ద్వారా బాధితులు అందించేందుకు వెళ్ళగా బాధితులకు నిరాశ మిగిలింది. వాటిని ముఖ్యమంత్రికి ఇవ్వాలని చూస్తే ఆయన దగ్గర ఉన్న ఎస్కార్ట్స్ వినతి పత్రాలు తీసుకున్నారు.

వైసిపికి సూపర్ సిక్స్‌తో చెక్ : ఆది

వైసిపికి సూపర్ సిక్స్‌తో సూపర్‌గా చెక్కు పెడతామని ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి అన్నారు. జమ్మలమడుగు నియోజవర్గానికి 30 రకాల సమస్యలు ఉన్నాయని వాటిని నివేదిక ద్వారా సిఎంకు అందిస్తామన్నారు. చేనేత కార్మికుల ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాజోలి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. టెక్స్టైల్ పార్కు అభివద్ధికి సహకరించాలని తెలిపారు. లోకేష్ తండ్రికి తగ్గ కాదు లోకేష్ తండ్రికి మించిన తనయుడని తెలిపారు.

42 మంది మార్గదర్శకుల గుర్తింపు : కలెక్టర్

జమ్మలమడుగు నియోజకవర్గంలో 42 మంది మార్గ దర్శకులను గుర్తించామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జమ్మల మడుగు పి4పై నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గూడెంచేరువు గ్రామంలో 1840 కుటుంబాలు ఉన్నాయన్నారు. అందులో అధిక భాగం చేనేత రంగంపై ఆధారపడిన వారేనన్నారు. 432 కుటుంబాలు చేనేత వత్తిపై ఆధారపడి మరమగ్గాలు, చేతి మగ్గాలు అవసరమని తెలిపారు. 141 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ బంగారు కుటుంబాలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించడం జరిగిందన్నారు.

పింఛను పంపిణీ చేస్తున్న సిఎం

మానసిక వికలాంగురాలి సమస్య వింటున్న చంద్రబాబు

పెన్నా నదిలో ఇద్దరు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి కోసం గాలింపు
- సిఎం పర్యటనలో బారికేడ్లను కట్టె కూలీలుగా గుర్తింపు

మృతిచెందిన మున్నా

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పెన్నా నదిలో ఈతకు దిగి ఇద్దరు గల్లంతైన సంఘటన జమ్మలమడుగు-ముద్దనూరు ప్రధాన రహదారిపై ఉన్న వంతెన భాగంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కడపకు చెందిన కూలీలు మున్నా (38), గోపాల్ సిఎం ప్రోగ్రాం నిమిత్తం బారికేట్స్ కట్టుటకు గురువారం పట్టణానికి వచ్చారు. పని అయిన తరువాత మద్యం సేవించి స్నానం చేయడానికి పెన్నా నదిలో నీటిలోకి దిగారు. ప్రమాదవశాత్తు ఇద్దరు నీటిలో మునిగి గంతలయ్యారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. వారిలో మున్నా మృతదేహం లభ్యమంది. గోపాల్ మృతదేహం ఇంకా బయటపడలేదు. గజ ఈతగాళ్ళు గాలించి చీకటి పడడంతో గాలించడం ఆపేశారు. శనివారం ఉదయం తిరిగి గోపాల్ మృతదేహం కోసం గాలిస్తారని పోలీసులు తెలిపారు. మున్నా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అవసరంలేని ప్యాకేజీ రైతులకు భారమే

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి- కడప అర్బన్

కాంప్లెక్స్, డిఎపి, కొంటేనే యూరియా ఇస్తామనే నిబంధన వెంటనే ఎత్తివేయాలని, అవసరం లేని ప్యాకేజీ రైతుల భారమనేనని, ప్రభుత్వమే వారిని నిలువు దోపిడీ చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న అన్నదా తలతో ఎరువుల దుకాణదారులు ఆటలాడుకుంటు న్నారన్నారు. యూరియా కోసం రైతుల పాట్లుకు ప్రభుత్వమే గురి చేస్తోందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు మామూళ్ల కోసం రైతుల గోడు చెవికి ఎక్కించుకోవడంలేదని తెలిపారు. ఎరువుల దుకాణదారులు రెచ్చిపోతున్నారని, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు యూరియా అవసరం ఉందని, రైతులను ఎరువుల దుకాణదారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎరువుల దుకాణదారుల పట్ల విజిలెన్స్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం రైతాంగానికి నష్టదాయకమన్నారు. నిలవలకు, అమ్మకానికి భారీ వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. అధికారులపై, పాలకులపై, ప్రభుత్వంపై రైతులకు తీవ్రమైన ఆగ్రహం రాకముందే యూరియా రైతాంగానికి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. పంటల సాగుకు కాకుండా ఇతరత్రా అవసరాలకు యూరియా మళ్లించకూడదని చెప్పారు. ఎరువులకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి ఒక్క ఎరువుల దుకాణదారుల స్టాక్ రిజిస్టర్ చెక్ చేయాలని, బ్లాక్ మార్కెట్ చేస్తున్న ఎరువుల దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ ఇంజినీర్ టెక్నికల్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి అరియర్స్ ఇవ్వాలని, ఈనెల 7న చలో విద్యుత్ సౌదా జయప్రదం చేయాలని యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్ రెడ్డి, డిస్కం అధ్యక్షులు ఎన్. శివశంకర్ కోరారు. శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం డిప్యూటీ ఇంజినీర్ టెక్నికల్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందర్నీ రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. కొత్త ఆపరే టర్లందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని తెలిపారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్ వినియోగించాలని, కార్మికు లకు అనారోగ్యం పాలైన, యాక్సిడెంట్ గురైన ఉచితంగా అన్లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరి ష్కారం కానందున యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొ న్నారు. ప్రతి ఒక్క కాంట్రాక్టు కార్మికుడు ఈ ఆందోళన పోరాటంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు, యూనియన్ జిల్లా నాయకులు రియాజ్, మధుసూదన్ నాయుడు, ఎర్రగుంట్ల సబ్ డివిజన్ కార్యదర్శి రవీంద్రారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ భవనం ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

- నగరంలో ప్రజా సంఘాల నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యుత్ భవన ఎదుట ఈనెల 5న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కడప 7 రోడ్లు సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్ టౌన్ మీదుగా ఆర్డిఓ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ, కరపత్రాల ప్రచారం నిర్వహించారు. అనంతరం వామపక్ష కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని వాపోయారు. రోజు వారీ డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఇఆర్‌సి అనుమతించడం దారుణమని ఆయన అన్నారు. సోలార్ విద్యుత్తు యూనిట్‌కు రూ. 1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకి రూ. 2.49 కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైంది కాదన్నారు. సెకితో ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండి వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సెకితో ఒప్పందం వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు రూ. లక్ష కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఇది మోయలేని భారం అవుతుందని వారు అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమర్చే కాంట్రాక్టును అదానికి కట్ట పెట్టారని విమర్శించారు. ఆదాని కంపెనీ 59, 21, 344 మీటర్లను బిగించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు రామ్మోహన్, వెంకటశివ, దస్తగిరిరెడ్డి, మద్దిలేటి,సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయకపోవడం మోసమే

ప్రజాశక్తి - కడప రూరల్ : వాలంటీర్ల జీతం పెంపు వంటి హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం మోసమే అని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, రాష్ట్ర వాలంటీర్ వింగ్ అధ్యక్షులు అఖిలేష్ అన్నారు. వైసిపి జిల్లా వాలంటీర్స్ వింగ్ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం రామాంజనేయపురంలోని నూతన జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాబోయే మూడేళ్లలో, పార్టీ కార్యకర్తలు మరింత చురుకుగా పని చేసి ప్రజల్లోకి మరింత చేరుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం 14 నెలల్లో ఒక్క అభివృద్ధి పథకాన్ని కూడా అమలు చేయలేదని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, మట్టి మాఫియా, భూ కబ్జాలు, జరుగుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే వైసిపి తిరిగి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా, నగర వాలంటీర్స్ వింగ్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయల్స్ ఆఫ్ రాయలసీమదే విజయం

ప్రజాశక్తి - కడప రూరల్

ఈనెల 8 నుంచి నుండి విశాఖపట్నంలో నిర్వహించబోయే ఆంధ్ర ప్రీమియం లీగ్- 2025(ఏ పీ ఎల్-2025) లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలుస్తుందని అక్షర ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఫౌండర్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు యజమాని శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఏ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పీఎల్- 2025లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు పాల్గొంటుందని చెప్పారు.. ఈనెల 5 రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు క్రీడాకారులు ఇక్కడే సాధన చేస్తారన్నారు. స్టేడియం కమిటీ ఛైర్మన్ ఆర్. శ్రావణ్ రాజ్‌రెడ్డి మాట్లాడుతూ కడప స్టేడియంలోనూ ఐపిఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు హెడ్ కోచ్ పైడికాల్వ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఐపిఎల్ -2025 మ్యాచ్‌లలో తమ జట్టు తప్పక విజయం సాధిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అందుకు తగ్గట్టుగా జట్టు క్రీడాకారులకు శిక్షణ లో తగు మెలకువలు, జాగ్రత్తలు ఇస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు సహాయజమాని రాజారెడ్డి, రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు క్రీడాకారులు రషీద్, పైలా అవినాష్ పాల్గొన్నారు.

8 నుంచి ఎస్‌టిఎఫ్‌ఐ ఆల్ ఇండియా మహాసభలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 8, 9, 10వ తేదీలలో కలకత్తాలో నిర్వహించే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) ఆలిండియా మహాసభలు జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్ వద్ద ఎస్‌టిఎఫ్‌ఐ జెండాను స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ రాజా, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ మహాసభకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టటానికి స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అలుపెరగని పోరాటం చేసిందన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అనేక పోరాటాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేసిన చరిత్ర ఎస్ టిఎఫ్‌ఐకు ఉందన్నారు. అలాగే న్యూ ఎడ్యుకేషన్ పాలసీ అమలుపై, ప్రభుత్వ విద్యారంగంలో కాషాయీకరణను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిరోధించడం కొరకు దేశవ్యాప్త ఉద్యమాలు చేసిన చరిత్ర కూడా ఎస్‌టిఎఫ్‌ఐకు ఉందన్నారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బి.కృష్ణారెడ్డి, జిల్లా కోశాధికారి నరసింహారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న మారెడ్డి లత

మారెడ్డి లత నామినేషన్

ప్రజాశక్తి - కడప అర్బన్

జడ్‌పిటిసి ఎన్నికల నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి సతీమణి మారెడ్డి లత అభ్యర్థిగా కడప నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హాజరై, అభ్యర్థిని అభినందించి పూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల్లో విజయం తథ్యం : డిసిసి

ప్రజాశక్తి - కడప అర్బన్

పులివెందుల జడ్‌పిటిసిగా కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి ధీమా వ్యక్తం చేశారు. కడప జడ్‌పి ఆఫీసులో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం పులివెందుల జడ్‌పిటిసి స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున అనిల్ కుమార్ రెడ్డి, శివ కళ్యాణ్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి జడ్‌పిటిసి ఎన్నికలతోనే పూర్వ వైభవం వస్తుందని చెప్పారు. పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల ఆదేశాల మేరకు నామి నేషన్ వేశారని చెప్పారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

రిమ్స్‌లో అన్నదానం

ప్రజాశక్తి- కడప అర్బన్

అన్నదానం చేస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో కడప రిమ్స్‌లో ప్రతి మంగళ, శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఉన్నామని కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తండ్రి శివానందరెడ్డి జ్ఞాపకార్థం రిమ్స్‌లో అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం, తమ వారి వైద్య సహాయార్థం, తమకు తెలిసిన వారిని పలకరించడం కోసం వచ్చి తమ దగ్గర ఉన్న డబ్బు సరిపోక ఇబ్బంది పడే వారికి సమయానికి ఆహార అందించాలనే ఉద్దేశంతో వారి అవస్తని గమనించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రతి వారం సుమారుగా 1000 భోజన పొట్లాలు, మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు పంచు తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రిమ్స్ లో మార్చురి వార్డ్ దగ్గర్లో ఉన్న మెంటల్ రీహాబిలిటేషన్ సెంటర్ వద్ద 70 మందికి అదనంగా పంచుతున్నట్లు పేర్కొన్నారు. తమ కళాశాల విద్యా సంస్థలో చదువుతున్నా విద్యార్థులు స్వచందగా ముందుకు వచ్చి ప్రతీ వారం భోజన ప్యాకెట్ ప్యాకింగ్, పంపిణీలో సహకరిస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుటే వాగ్వివాదానికి దిగిన మున్సిపల్ చైర్మన్, రైతు విభాగం ఉపాధ్యక్షులు

ఎమ్మెల్యే సమక్షంలో నేతల వాగ్వాదం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీలో శుక్రవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలోనే టిడిపి నాయకులు తోపులాట చేసుకున్నారు. వివరాలు.. మున్సిపాల్టీ పరిధిలోని 14వ వార్డులో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పక్కనే మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ఉండగా టిడిపి రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు ధనపాల జగన్ కలుగజేసుకుని 'టిడిపి కార్యక్రమంలో నీకు ఏమి పని' అంటూ దూరంగా నెట్టారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో మాచనూరు చంద్ర, ధనపాల జగన్ పోటీపడ్డ విషయం తెలిసినదే. ఈనేపథ్యంలో చంద్ర గత ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేయలేదని ప్రస్తుతం అధికారం ఉండడంతో పార్టీకి దగ్గరగా ఉంటున్నాడని జగన్ వాపోయారు. తోపులాటతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఇరువురిని వారించే ప్రయత్నం చేశారు. ఇలా కార్యక్రమాల్లో ఉన్నప్పుడు ఘర్షణలకు పాల్పడడం ఏమిటని, దౌర్జన్యం చేసే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. అనంతరం తోటి టిడిపి నాయకులు ఇరువురికి సర్దిచెప్పి సమస్యను పరిష్కరించారు.

రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చాపాడు

ఆర్‌జెడికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మైదుకూరు పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్ ను నియమించి, కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఇంటర్మీడియట్ ఆర్‌జెడి సురేష్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి పది సంవత్సరాలు పూర్తయిన కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్ లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌ల కారణంగా కళాశాల అకాడమిక్ విధానాన్ని సరిగా నిర్వహించలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని కోరారు. అదేవిధంగా ఉర్దూ జూనియర్ కళాశాలలో ఉర్దూతో పాటు అన్ని రకాల కోర్సులను అందుబాటులో ఉంచి జనరల్ జూనియర్ కళాశాలగా ఏర్పాటు చేస్తే విదా ్యర్థులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆర్‌జెడి స్పందిస్తూ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పోలీసు ఫలితాల్లో రైతు బిడ్డల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

సునీల్ కుమార్ రెడ్డి

పోలీసు నియామకాలకు సంబంధించి ప్రభుత్వం శుక్రవారం ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో రైతు కుటుంబాలకు చెందిన పలువురు ఉత్తమ ప్రతిభ కనపరిచి పోలీసులుగా ఎంపికయ్యారు. చాపాడు మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గురు ప్రసాద్ యాదవ్, కాశీ విశ్వనాథ్ ఎంపికయ్యారు. అలాగే మైదుకూరు మండల పరిధిలోని ఉత్సలవరం గ్రామానికి చెందిన వి. సునీల్ కుమార్ రెడ్డి, మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురానికి చెందిన బి వెంకట సుమన్ సివిల్ పోలీసులుగా ఎంపికయ్యారు. మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డులోని శ్రీరామ్ నగర్ కు చెందిన టి.వెంకటేశు ఏఆర్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. వీరందరూ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం.

పోలీసు కానిస్టేబుళ్లుగా అన్నదమ్ములు

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

అన్నదమ్ములు విజయనారాయణ, లక్ష్మినారాయణ

ఇటీవల ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో పోలీసు ఉద్యోగాలకు ఇద్దరు అన్నమ్ములు ఎంపికయ్యారు. పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో నివాసం ఉన్న చింతా చంద్ర నారాయణ, శ్యామలా దేవి దంపతులు కుమారులు విజయ నారాయణ, లక్ష్మి నారాయణకు ఉద్యోగాలు రావడంతో ఆ కుటుంబానికి ఆనందానికి అవధులు లేవు. కుటుంబంలోని ఇద్దరు అబ్బాయిలకు కానిస్టేబుల్ ఉద్యోగాలు రావడం పట్ల తల్లిదండ్రులుతోపాటు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఒకేసారి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రైడే తప్పక పాటించాలి

ప్రజాశక్తి - వేముల

లార్వా నివారణ మందును స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది

దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు. శుక్రవారం వేముల సచివాలయం, ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వాను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం మండలంలో వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా అధికారులు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీధుల్లో మురుగునీరు, నిల్వ ఉన్ననీరు, ఇళ్లపరిసరాల్లో నీటిని పరిశీలించి, దోమల లార్వాను గుర్తించి నిర్మూలిస్తామని పేర్కొరన్నారు. స్థానికంగా జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమేష్ , విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆశా, పద్మావతి పాల్గొన్నారు. **బద్వేలు :** పరిసరాలను శుభ్రంగా పెట్టుకుంటే, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని బయనపల్లెలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగు కాల్వల వల్ల అనారోగ్యం, బయట తిండి పదార్థాలను తగ్గించాలని, కూల్‌డ్రింక్స్ బదులు టెంకాయ నీళ్ల, మజ్జిగ తీసుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమల నివారణకు తీసుకోవాల్సిన విషయాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, ఎఎన్ఎంలు అఖిలభాను, గంగాదేవి, హెడ్మాస్టర్ రేచల్ రాణి, ఆశ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- పింఛన్ల పంపిణీలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి - చాపాడు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలోని 14వ వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం మైదుకూరు నియోజకవర్గంలో 35 వేల పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. కొత్తగా మైదుకూరుకు 606 నూతన పెన్షన్లు మంజూరు అయ్యాయన్నారు. రూ.4000 పెన్షన్ ఇచ్చే చరిత్ర దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీలో ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ చేతుల మీదులుగా పింఛను అందించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వంలో అర్హత లేని వారికి పెన్షన్ ఇచ్చారన్నారు. అర్హత లేని వారిని గుర్తించి పెన్షన్లు తొలగించామన్నారు. మున్సిపాల్టీ యాక్షన్‌లో హైస్కూల్ సమీపంలో తీసుకున్న రూములో చేపలు, చికెన్ వంటివి అమ్మడంతో చర్యలు తీసుకున్నామన్నారు. ఇడమడక వద్ద హైవే పై డాబాను తీసేస్తే వైసిపి నాయకులు విమర్శిస్తున్నారని ఆ డాబా వద్ద ఎంతోమంది రోడ్డు ప్రమాద బారిన పడ్డారని అందుకే తొలగించామని చెప్పారు. మైదుకూరు అభివృద్ధికి సిఎం చంద్రబాబు రూ.220 కోట్లు హామీ ఇచ్చారని, రూ.100 కోట్లు ఆర్థిక శాఖ అనుమతులకు వెళ్లాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : గత ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది అని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్ అన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లక్ష వితంతు పింఛన్ల పంపిణీ పండగ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 221 వితంతువులకు వితంతు పింఛన్లు పంపిణీ చేసింది. అందులో భాగంగా గౌరవ శాసనసభ్యులు వరదరాజులు రెడ్డి ఆదేశాల ప్రకారం 33 వ వార్డులో సచివాలయ సిబ్బంది అర్హులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అచ్చుపట్ల హుస్సేన్ సాబ్. 33 వ వార్డు అధ్యక్షులు పాలగిరి దావూద్, టిఎన్‌టియుసి జిల్లా నాయకులు, బిసి నాయకులు మోత్కూర్ లక్ష్మీనారాయణ, ఐటిడిపి రహమాన్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

తల్లిపాల ఆవశ్యకత గుర్తించాలి

చాపాడు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ

ప్రజాశక్తి - చాపాడు

పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ తెలిపారు. విశ్వనాధాపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. దీంతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. 6 నెలలు నిండిన చిన్నారులకు తల్లి పాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే అనుబంధ పోషకాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **వేంపల్లె :** పిల్లల్లో నిరోధక శక్తిని పెంచేందుకు ముర్రుపాలును తాగించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం మండలంలోని అలిరెడ్డిపల్లె, చింతలమడుగుపల్లె-2 గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ముర్రుపాలుపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం పంచాయతీ కార్యదర్శి కిషోర్ నాయుడు, విఆర్ఓ షేక్ బాదుల్లా, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు. గమనిక - ఫోటో - చింతలమడుగుపల్లెలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాల్లో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ స్వర్ణలత **బద్వేలు :** తల్లి ఒడిలో శిశువు ఆనందం, అమ్మ పాలలో నిబిడీకృతమై రోగనిరోధక శక్తి, పౌష్టిక విలువలు, అనుబంధం, భయం లేని భరోసా కలిసి శిశువు దినదినాభివృద్ధి జరుగుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడి దేవదత్తం అన్నారు. శుక్రవారం బి. కోడూరు మండలం మేకవారిపల్లె గ్రామం అంగన్వాడీ కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో కరపత్రాలు విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ యూనిసెఫ్ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియచెప్పేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు వారం రోజులు పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను ప్రచారం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసి రామకృష్ణ, యుటిఎఫ్ మండల నాయకులు కొండయ్య, జెవివి నాయకులు పవన్, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, శ్రీనివాసులు, రామాంజనేయ రాజు, శ్రీనివాసులు రెడ్డి, ఉమా, శాంతి కుమారి, అంగన్వాడి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవాలి

- గుండె వ్యాధుల నిపుణుడు డాక్టర్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

ఒత్తిడి అనేది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది కాబట్టి విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు యోగా, ధ్యానం లేదా ఇతర ఒత్తిడి తగ్గించే పద్ధతులను అనుసరించడం మంచిదని గుండె జబ్బుల నిపుణుడు డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐక్యాంపస్‌లో విద్యార్థులకు గుండె జబ్బులపై కడపకు చెందిన వేదాంత ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే గుండె పోటు వచ్చిన వ్యక్తికి సిపిఆర్, లైఫ్ సపోర్ట్ విధానంపై డెమో ద్వారా విద్యార్థులతో చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులను ముందుగానే గుర్తించడానికి రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవడం చాలా ముఖ్యం అన్నారు. ప్రస్తుతం చిన్న వయస్సు వారికి కూడా గుండె జబ్బులు సోకి మృత్యువాత పడుతున్నారని చెప్పారు. గుండె జబ్బులు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం గుండె ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. ఆకస్మతుగా వ్యక్తి పడిపోతే చదునైనా నెలపై పడుకోపెట్టి పల్స్ చెక్ చేసి వెంటనే సిపిఆర్ చేయాలని కోరారు. అనంతరం వైద్యులైన డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ ఎస్ఎఫ్ బాషాను ట్రిపుల్ ఐటి క్యాంపస్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ రమేష్ కైలాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దీప్తీ, పిఆర్ ఓ తిరుపతి రెడ్డి, ఆర్కేవ్యాలీ వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యులను సన్మానిస్తున్న ట్రిపుల్ఐటి డైరెక్టర్

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని అమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ కోరారు. శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతను రాష్ట్ర ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. డిజిటల్ విద్యాబోధన సంబంధించి కనెక్షన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. నాసికంగా బ్యాగులు ఇవ్వడం వల్ల విద్యార్థుల పుస్తకాల బరువుకు చిరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇచ్చే షూలు సరిగా లేకపోవడం వల్ల పాఠశాలల్లోనే గుట్టలు గుట్టలుగా వేయడం అవివేకం అన్నారు. నాణ్యమైన బ్యాగులను విద్యార్థులకు అందివ్వాలని కోరారు. అసంపూర్తిగా నిలిచి పోయిన పాఠశాలల భవనాలను కూడ వెంటనే పూర్తి చేయాలని కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఎస్.ఎం.డి గౌస్, షఫీ, సమీర్ పాల్గొన్నారు.

హోమియోపతి కళాశాలలో పీజీ సీట్లు రద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈ ఏడాది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి వారు కడప, గుడివాడ, రాజమండ్రిలలోని ప్రభుత్వ హోమియో కళాశాలలో పీజీ సీట్లను అధ్యాపకులు తక్కువ మంది ఉన్నారన్న సాకుతో రద్దు చేశారు. కడప కళాశాలలో మొత్తం 8 పీజీ సీట్లను, రాజమండ్రిలో ఉన్న మొత్తం 24 పీజీ సీట్లను, గుడివాడలోని 24 పీజీ సీట్లలో 12 పీజీ సీట్లను తొలగించారు. ఇప్పుడు ఎపి మొత్తానికి 54 పీజీ సీట్లకుగాను 12 పీజీ సీట్లు మాత్రమే అనుమతించారు. రాజమండ్రిలో 60 యూజీ సీట్లకుగాను కేవలం 50 మాత్రమే అనుమతి ఇచ్చారు. ఒక్కసారి సీట్లు తగ్గిపోతే భవిష్యత్తులో అనుమతులు తెచ్చుకోవడం అసాధ్యం. ఆయుష్ కమిషనర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈ విషయాలను పరిశీలించి కళాశాలలో పీజీ సీట్లు పోకుండా కాపాడాలని విద్యార్థులు కోరుకు ఒటున్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఇలా ఉంటే తెలంగాణలో 173 పీజీ సీట్లు అక్కడ వద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో మాత్రం 12 పీజీ సీట్లు ఉన్నాయి. పేరుకు డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్న కూటమి నేతలు దీనిపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడిగా బిర్రు గుర్రప్ప

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడుగా బిర్రు గుర్రప్పను నియమిస్తున్నట్లు పార్టీ అధినేత సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం జమ్మలమడుగు నానుబాల ఫంక్షన్ హాల్ నిర్వహించిన పార్టీ మీటింగ్ లో నియమించారు. బిర్రు గుర్రప్ప మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన చంద్రబాబు నాయుడుకు, సహకరించిన జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డికి రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి జంబాపురం రమణ రెడ్డికి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-లింగాల

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను సర్వేనెంబర్ వారిగా పంట నమోదు చేయాలని పులివెందుల వ్యవసాయ సంచాలకులు ప్రభాకరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజు వారి ప్రణాళిక ప్రకారం పంట నమోదు పూర్తి చేయా లన్నారు మరిన్ని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో వ్యవసాయాధికారి రమేష్, రైతు సేవా సిబ్బంది ప్రసన్న పాల్గొన్నారు.

సిఎంపై జగన్ వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేసి పెట్టు బడులు తెచ్చే ప్రయత్నంలో ఉంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కక్ష కట్టే ప్రయత్నంలో ఉన్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి అంటే చంద్రబాబుకు సరిపోదని, అందుకే ఎంపీ మిదున్ రెడ్డిని జైల్లో పెట్టారని, ప్రజలను నమ్మబలికే మాటలు మాట్లాడుతున్నారని, వారి మాటలను ఖండిస్తున్నామని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో మిథున్ రెడ్డికి సంబంధం ఉంది కాబట్టే సిట్ అధికారులు దోషిగా చేసి అరెస్ట్ చేశారని చెప్పారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాచార హక్కు చట్టంపై విద్యార్థి దశలో అవగాహన వల్ల భవిష్యత్తులో ప్రయోజనకరమని ప్రిన్సిపల్ డాక్టర్ వేముల సలీం బాష, ఆర్.టి.ఐ పరిశోధకులు యోగి వేమన విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు పేర్కొన్నారు. ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఎ), కడపలో నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005 పై ఇంటర్-కళాశాల పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ ఎం. శాంత పోటీలను ప్రారంభించారు. సమాచార హక్కు చట్టం చారిత్రక నేపథ్యం గురించి డాక్టర్ సురేష్ బాబు అవగాహన కల్పించారు.చట్టంపై అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో శాంత వివరించారు. జిల్లాలోని 7 ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, చర్చ (డిబేట్), క్విజ్ పోటీలు ఆర్‌టిఐ యాక్ట్ ప్రాముఖ్యత, పారదర్శకత, ప్రజా బాధ్యతలపై దృష్టి అంశాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేసి అభినందించారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ఋణాలు మంజూరులో జాప్యమేలా

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పనతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఋణాలు మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానించి ఇంతవరకు ఋణాలు మంజూరులో జాప్యం ఎందుకు అయిందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కార్పొరేషన్ ద్వారా ఋణాలు మంజూరు కాక ఖాళీ కార్పొరేషన్ల ఉన్నాయన్నారు.కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలలో అధికారులకు వస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కింద సబ్సిడీ ద్వారా ఋణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ ద్వారా ఋణాల మంజూరుకు సబ్సిడీ ద్వారా దరఖాస్తుల ఆహ్వానించిందన్నారు. కానీ ఇంతవరకు అర్హుల జాబితా విడుదల చేయకపోగా ఋణాల మంజూరు ఎప్పుడు వస్తాయో అనే ఆలోచనతో నిరుద్యోగ యువత ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే ఋణాల డబ్బును ఇతర అవసరాల కోసం ఖర్చు చేసి నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా సబ్సిడీ ఋణాల మంజూరు లో జాప్యం చేస్తుందని చెప్పారు. తక్షణమే ఋణాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మేరీ కుమార్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా తులసిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె : కాంగ్రెస్ శ్రేణుల మధ్య పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి తన 75వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పులివెందుల సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ ను ఆయన చేతుల మీదుగా కట్ చేయించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు పార్టీల అతీతంగా తులసిరెడ్డిని శాలువతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. **ఖాజీపేట :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసి రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మెయిన్ బజార్ లోని అంగన్వాడీ కేంద్రంలో స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్‌సి సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

స్ట్రాంగ్ రూములు పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో భాగంగా ఈనెల 12న నిర్వహించబోయే ఎన్నికలకు సంబంధించి సామగ్రిని భద్రపరిచేందుకు స్థానిక జెఎన్‌టియు కళాశాలలో స్ట్రాంగ్ రూములను పులివెందుల తహాశీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపిడిఒ కృష్ణమూర్తి, పట్టణ సిఐ చాంద్‌బాష పరిశీలించారు. బ్యాలెట్ల బాక్స్‌ల భద్రతకు కావాల్సిన సదుపాయాల గురించి చర్చించారు.

బొమ్మిశెట్టి రమేష్‌కు కీర్తిరత్న పురస్కారం

ప్రజాశక్తి - చాపాడు : మైదుకూరు పట్టణం సాయిదాపురానికి చెందిన రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి శెట్టి రమేష్‌కు కీర్తి రత్న పురస్కారం హైదరాబాద్ మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు అందజేయనున్నారు. ఈనెల 3న హైదరాబాద్ లకిడికపూల్ బిర్లా ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో రచయిత పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఆయన రచించిన ఎన్నో వ్యాసాలు ప్రముఖ దినపత్రికలలో ప్రచురితమయ్యాయి. కరోనా కాలం నుంచి ఇప్పటికీ ఎన్నో వీర ఘల్లులు, శాసనాలు, శిథిలావస్థలో ఉన్న చారిత్రక కట్టడాలు, ఆలయాలపై పరిశోధనలు విస్తృతంగా చేస్తున్నట్లు తెలిపారు. సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పురస్కారం రావడం పట్ల కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు, బంధువులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రేపు యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జియుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఈనెల 3న జిల్లా స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ -2025 పోటీలు నిర్వహించినట్లు వైఎస్ఎస్ ఎపి ప్రెసిడెంట్ రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్కేవ్యాలీ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో జిల్లా స్థాయిలో నిర్వహించే యోగాసన ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపే యువతకు రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీల్లో అడుగు పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టే యోగాసన పోటీల్లో యువతలో శారీరక దారుఢ్యం, మానసిక శాంతి, శ్రమశీలతను పెంపొందించడమే కాకుండా, యోగాసనాల్లో వారి ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. కడప జిల్లాలోని యోగా క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు యోగాసన ఛాంపియన్ షిప్ పోటిలు గొప్ప వేదిక అన్నారు. కాబట్టి పోటిల్లో పాల్గొన్నేందుకు ఆసక్తి ఉన్న యువత ముందుగానే పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పేరు నమోదు కోసం 99592 59211, 99636 28927 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో నాయకులు

5న 'రండి..టీ తాగుతూ మాట్లాడుదాం'

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న 'రండి..టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు వి రఘురామ నాయుడు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, తాలూకా కార్యవర్గ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలు, వారికి రావాల్సిన బకాయిలు సుమారు రూ.25 వేల కోట్లకు సంబంధించి దాదాపుగా 12 రకాల సమస్యలను చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, కృష్ణ ప్రసాదు, జిల్లా కార్యదర్శి జె. సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, బి.వి.చంద్రశేఖర్, కోశాధికారి సతీష్ కుమార్, నగర కార్యదర్శి సిటీ రామానుజన్ రెడ్డి, రాజేశ్వరి, రమణమ్మ, జిల్ల, సిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండలంలోని నిడివెలగల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ డాక్టర్ శివశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ద్వారా భర్తీ కాలేని సీట్లను ప్రత్యక్ష ప్రవేశాల ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులు, పాలిసెట్ ర్యాంక్ ఉన్నవారు లేకపోయినా కూడా స్పాట్ అడ్మిషన్ కోసం అర్హులు అన్నారు. ఆసక్తి ఉన్నవారు తక్షణమే కళాశాల కార్యాలయంలో సంబంధిత పత్రాలతో సంప్రదించాలని ఆయన కోరారు. అడ్మిషన్ ప్రక్రియ మొదటి వచ్చినవారికి ప్రాధాన్యత ప్రాతిపదికన ఉంటుందన్నారు. మరిన్ని వివ రాలకు 9010 222 184 నంబరుకు సంప్రదిశి ంచాలని ఆయన సూచించారు.

పాస్‌పోర్ట్ పోయినది

కడప జిల్లా, ఒంటిమిట్ట మండలం, మంటపం పల్లె గ్రామ పంచాయతీ డోర్ నెం: 2-18, హరిజనవాడలో నివాసం ఉంటున్న ముక్కర వెంకట రెడ్డయ్య భార్య ముక్కర శివమ్మకి చెందిన పాస్‌పోర్ట్ 21.06.2025వ తేదీన మంటపంపల్లె నుండి ఒంటిమిట్టకు వెళ్తుండగా ఆటోలో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **W9367792** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 7995674189 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.